క్లుప్తంగా

సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

గన్నవరం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాల్సిన గురుతర బాధ్యత గృహసారథులు, సచివాలయం కన్వీనర్లపై ఉందని ఎంపీపీ అనగాని రవి చెప్పారు. మంగళవారం రాత్రి మండలంలోని సావరగూడెం గ్రామంలో మండల గృహసారథులు, సచివాలయం కన్వీనర్లు మండల కన్వీనర్ కైలే శివకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొని మాట్లాడారుజ ఏఎంసీ చైర్మన్ ఆర్.అంజనీ కుమారి, మండల పార్టీ కన్వీనర్ నీలం ప్రవీణ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, రాష్ట్ర పార్టీ సంయుక్త కార్యదర్శి ఆర్‌వీఆర్, సర్పంచ్ అట్ల నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన పాలకుర్తి జయలక్ష్మి గత మూడేళ్ల క్రితం ప్రైవేటు ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్న వెంకటదుర్గాప్రసాద్‌ను వివాహం చేసుకుంది. ఆ సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే భర్తతో పాటు అత్త విజయలక్ష్మి, మామా కృష్ణ అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

గడువులోగా నమోదు పూర్తవ్వాలి

పెనమలూరు: చట్టరీత్యా స్కానింగ్ కేంద్రాలను నమోదు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి. గీతాబాయ్ అన్నారు. ఆమె మంగళవారం కానూరులో స్రవంతి ఆస్పత్రి, పోరంకిలో సాయిసమన్య ఆస్పత్రులు స్కానింగ్ కోసం దరఖాస్తు చేయటంతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అన్ని స్కానింగ్ కేంద్రాలు చట్ట ప్రకారం నమోదు చేయాలన్నారు. ఎవరైన లింగ నిర్ధారణ ఎంపిక చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 31వ తేదీ నాటికి అన్ని స్కానింగ్ కేంద్రాలు నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరికీ ఉచిత విద్య ప్రభుత్వ లక్ష్యం

గన్నవరం రూరల్: పాఠశాలల్లో విద్య కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారని, తల్లిదండ్రులు ఈ సేవలు వినియోగించుకొని విద్యార్థులను ఉన్నతంగా చదివించాలని ఎంపీపీ అనగాని రవి చెప్పారు. మంగళవారం మెట్లపల్లి ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా ఎంపీపీ రవి పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్ తూంపాటి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గ పాల్గొన్నారు.

నకిలీ పోలీసులపై కేసు నమోదు

పెదకాకాని: గుట్కాలు అమ్ముతున్న వారితో పోలీసులమని బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ బందారు సురేష్‌బాబు తెలిపిన వివరాలు.. కృష్ణా జిల్లా ఉయ్యూరుకు చెందిన నలగాపుల శ్రీనివాసరావు, రాజులపాటి నాగరాజు ఇళ్లకు సీలింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటారు. మంగళవారం రాత్రి నంబూరులో ఓ షాపు నిర్వాహకుడిని బెదిరించి రూ.3 వేలు వసూలు చేశారు. అలానే మరో షాపు వద్ద కూడా వసూలు చేస్తుండగా దుకాణదారుడు నిలదీశాడు. దీంతో వారు పారిపోయేందుకు ప్రయత్నించగా దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోరుముద్దకు జావసత్వాలు



వెంకటాపురం ఎలిమెంటరీ స్కూల్‌లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న సర్పంచి దేవగిరి సుజాత



కేసరపల్లిలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు



పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ డైరెక్టర్లు

- పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ
- జగనన్న గోరుముద్దలో భాగంగా పంపిణీ

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద మెనూలో మంగళవారం నుంచి తాజాగా రాగి జావ విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి కనకమహాలక్ష్మి వివరాలు తెలుపుతూ.. మండలంలోని 36 ప్రభుత్వ పాఠశాలల్లో 6,103 మంది విద్యార్థులు మంగళవారం హాజరయ్యారన్నారు. వీరిలో జగనన్న గోరు ముద్ద పథకం కింద 4,631 మంది ప్రభుత్వం ప్రవేశ పెట్టిన రాగిజావ పంపిణీ చేశామని వివరించారు.

విద్యార్థుల ఆరోగ్యమే ప్రధానం

పాతపాడు(విజయవాడరూరల్): విద్యార్థులు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న గోరుముద్ద కార్యక్రమంలో భాగంగా రాగిజావను అందిస్తున్నారని పాతపాడు గ్రామ సర్పంచి దేవగిరి సుజాత అన్నారు. మంగళవారం పాతపాడు శివారు వెంకటాపురం గ్రామంలోని ఎలిమెంటరీ స్కూల్ నందు విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్కూల్ విద్యాకమిటీ చైర్మన్ గాలి అంకమహాలక్ష్మి, ప్రధానోపాధ్యాయులుపాల్గొన్నారు.

పాఠశాలలో రాగిజావ పంపిణీ

గన్నవరం: కేసరపల్లి జెడ్పీ హైస్కూల్, ఎంపీపీ పాఠశాలలో సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, వైస్ ఎంపీపీ కాలగడ్డ శివనాగరాజకుమారితో కలిసి జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి ప్రారంభించారు. దావాజిగూడెం ఎంపీపీ స్కూల్‌లో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ. గౌసాని, సర్పంచి బడుగు బాలమ్మ, హెచ్‌ఎం నవభారతి, పీసీ చైర్మన్ పరుశురామ్ రాగిజావ పంపిణీ ప్రారంభించారు. అల్లాపురం ఎంపీపీ పాఠశాలలో సర్పంచ్ డొక్కు సాంబశివవెంకన్నబాబు చేతుల మీదుగా రాగిజావను విద్యార్థులకు అందజేశారు. స్థానిక జెడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి, చింతలపేట ఎంపీపీ పాఠశాలలో ఎంపీటీసీ సభ్యులు మద్దినేని వెంకటేశ్వరరావు రాగిజావ పంపిణీ ప్రారంభించారు.



కాటూరులో విద్యార్థులకు రాగి జావ అందిస్తున్న సర్పంచ్ ఆశాజ్యోతి

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ

రామవరప్పాడు: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ అనేక కార్యక్రమాలను చేపడుతోందని రూరల్ మండల ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి అన్నారు. విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న గోరు ముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు పోషకాలు అందించే రాగిజావ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో భార్గవి, ఎంఈవో వెంకటరత్నం, గ్రామ సర్పంచ్ వరి శ్రీదేవి పాల్గొన్నారు.

రాగిజావతో విద్యార్థులకు పోషకాలు

కంకిపాడు: రాగిజావతో విద్యార్థులకు పోషకాలు సంపూర్ణంగా అందుతాయని వక్తలు పేర్కొన్నారు. పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమం మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, సర్పంచ్ ముసిబోయిన విజయకుమారి, వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్, కమ్మ, ఉమెన్‌ఫైనాన్స్, నగర కార్పొరేషన్ డైరెక్టర్లు పాల్గొన్నారు. నెప్పల్లి ఎంపీపీ పాఠశాలలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ కొణతం గిరిధర్ ప్రారంభించారు. సర్పంచ్ మండవ ప్రగతి బహూకరించిన గ్లాసులను మండవ కిశోర్ చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. మద్దూరు జెడ్పీ పాఠశాలలో చేపట్టిన రాగి జావ పంపిణీని సర్పంచ్ చిప్పల రామదాసు ప్రారంభించారు. ఈడుపుగల్లు జెడ్పీ పాఠశాలలో రాగి జావ పంపిణీని వైఎస్సార్‌సీపీ నేత పర్వతనేని సుభాష్, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, సర్పంచ్ పి.ఇందిర, ఎంపీటీసీ సభ్యులు ప్రారంభించారు. మంతెన ఎంపీపీ పాఠశాలలో ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు రాగి జావ పంపిణీ ప్రారంభించారు.

విద్యార్థులకు రాగి జావ

ఉయ్యూరు: పాఠశాలల్లో మంగళవారం విద్యార్థులు రాగి జావ పంపిణీ ప్రారంభించారు. ప్రభుత్వ ఆదేశాలతో ఉయ్యూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని పాఠశాలల్లో రాగి జావ పంపిణీ జరిగింది. కాటూరులో సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి విద్యార్థులకు రాగి జావ అందించారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, కలవపాములలో సర్పంచ్ పొనుగుమాటి బాలస్వామి, బోళ్లపాడులో ఎంపీటీసీ తుమ్మూరు గంగారత్నం, పెద ఓగిరాలలో సర్పంచ్ త్రిపురం లక్ష్మి, గండిగుంటలో సర్పంచ్ గెత్తం అనుపమ రాగి జావ పంపిణీ ప్రారంభించారు. మున్సిపాలిటీలోని 4వ వార్డులో వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు విద్యార్థులకు రాగి జావ అందించారు.

సంపూర్ణ ఆరోగ్యానికి రాగి జావ దోహదం



ముస్తాబాదలో విద్యార్థులకు రాగి జావ అందజేస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి

గన్నవరం రూరల్: విద్యార్థులు శారీరకంగా ధృడంగా ఉన్నప్పుడే మానసికంగా బలంగా ఉంటారని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి అన్నారు. మంగళవారం మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో జగనన్న గోరుముద్దతో పాటు ప్రభుత్వం నూతనంగా విద్యార్థులకు అందజేస్తున్న బెల్లంతో కలిపి రాగిజావను ఆమె విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం ఎంవీ సుబ్బారావు, సర్పంచ్ వి.రాధాకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ కందుల రాజేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. గొల్లనపల్లి జెడ్పీహైస్కూల్‌లో సర్పంచ్ గణపవరపు శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు మోరం నాగరాణి, వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, మెట్లపల్లి ఎంపీపీ పాఠశాలలో ఎంపీటీసీ సభ్యురాలు చిలకపాటి దుర్గా, సీఆర్‌పీ ఎండీ రఫీ, గోపవరపుగూడెం ఎంపీయూపీ పాఠశాలలో సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు విద్యార్థులకు బెల్లంతో కలిపిన రాగి జావను అందజేశారు.

ప్రతి విద్యార్థికీ పోషకాహారం

ఉంగుటూరు: ప్రతి ఒక్క విద్యార్థికి పరిపూర్ణ పోషకాహారం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నారని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. జగనన్న గోరుముద్దలో భాగంగా మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో బెల్లంతో కూడిన రాగిజావను మంగళవారం పంపిణీ చేశారు. తేలప్రోలు, ఆత్కూరు, పొట్టిపాడు గ్రామాల్లో జిల్లా పరిషత్ హైస్కూల్‌లలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ పాల్గొని రాగిజావ పంపిణీని ప్రారంభించారు. మానికొండలో వైస్ ఎంపీపీ వీరంకి కుసుమ, తేలప్రోలులో సర్పంచ్ దిబోర, హెచ్‌ఎంలు, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్‌లు సభ్యులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తికి హామీ



మంత్రి అంబటి రాంబాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఐక్యవేదిక సభ్యులు

పెనమలూరు: యనమలకుదురులో అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తి చేయటానికి రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హామీ ఇచ్చారని గ్రామ వంతెన సాధన ఐక్యవేదిక కమిటీ తెలిపింది. ఈ మేరకు కమిటీ మంగళవారం వివరాలు తెలుపుతూ వంతెన నిర్మాణానికి 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. అయితే గత టీడీపీ పాలనలో పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారని తెలిపారు. కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపు చేయక పోవటంతో వంతెన పనులు నిలుపుదల చేశారన్నారు. అయితే ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవతో జలవనరుల శాఖ పెండింగ్‌లో ఉన్న వంతెన బిల్లును ఆర్థిక శాఖకు పంపామని మంత్రి రాంబాబు తెలిపారన్నారు. సీఎంతో మాట్లాడి బిల్లు క్లియరెన్స్ అయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. మంత్రి కార్యాలయంలో మంగళవారం మంత్రిని కలిసి వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు, ఐక్య వేదిక సభ్యులు షేక్.కాశిం, యు.త్రిమూర్తి, షేక్.మస్తాన్‌వలి, పాతాళలక్ష్మి, మోపిదేవి గంగాధర్ ఉన్నారు.

పవిత్ర రంజాన్‌కు ఏర్పాట్లు



ఉయ్యూరు: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రత్యేక వసతులు, ఏర్పాట్లు కల్పిస్తామని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వల్లభనేని నాని, కమిషనర్ వెంకటేశ్వరరావును వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, ముస్లిం నాయకులు మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ రంజాన్ మాసం సందర్భంగా తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, దోమల నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. కుక్కల బెడద తొలగించాలన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి వితరణ

ఉంగుటూరు: మండలంలో ఆత్కూరు జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. సీతారామాంజనేయులు, శ్రీమన్నారాయణలు తమ తల్లిదండ్రులైన సుబ్బమ్మ, సుబ్బయ్య జ్ఞాపకార్థం రూ.7500 విలువ గల రైటింగ్ ప్యాడ్స్, కంపాస్, పెన్ను, పెన్సిల్, లాంగ్ స్కేల్‌లు విద్యార్థులకు అందజేశారు.

సంక్షిప్త వార్తలు

దాతల సహకారం అభినందనీయం

కంకిపాడు: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినందనీయమని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు వైస్ ఎంపీపీ కలపాల ప్రకాష్ రూ. 10,116, పాఠశాల ఉపాధ్యాయురాలు కోనేరు కాత్యాయని తన కుమార్తెకు కొడుకు జన్మించిన సందర్భాన్ని పురస్కరించుకుని రూ. 10116 వితరణగా అందించారు.

పౌష్టికాహారంపై అవగాహన అవసరం

కంకిపాడు: పౌష్టికాహారంపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ ఈడుపుగల్లు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.స్వర్ణకుమారి అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని పునాదిపాడు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. సూపర్‌వైజర్ స్వర్ణకుమారి మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలు, చిన్నారులకు ఆకుకూరలు, చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలను తెలుసుకోవాలన్నారు.

డౌన్ సిండ్రోమ్‌పై అవగాహన సదస్సు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న స్పందన మానసిక వికాస కేంద్రంలో మంగళవారం ప్రపంచ డౌన్ సిండ్రోమ్ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు మాట్లాడుతూ క్రోమోజోమ్‌ల లోపం వల్ల డౌన్ సిండ్రోమ్ సమస్య ఏర్పడుతుందన్నారు. దీనివల్ల మానసిక వైకల్యం కలిగిన పిల్లలు జన్మించడం జరుగుతుందన్నారు. దీనికి పౌష్టికాహార లోపం, వారసత్వ, పర్యావరణ కారణాలు, గర్భవతిగా ఉన్న సమయంలో వైద్యులు సలహాలు పాటించకపోవడం కారణమని చెప్పారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్, వికాస కేంద్రం కార్యదర్శి ఎస్. రజిత తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

కంకిపాడు: కంకిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు అన్నారు. కంకిపాడు ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవితో కలిసి స్థానిక జెడ్పీ పాఠశాలను మంగళవారం సందర్శించారు. విద్యార్థినులు తమకు రెండు మాత్రమే మరుగుదొడ్లు ఉన్నాయని చెప్పటంతో సమస్యను మండల పరిషత్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. విద్యార్థినుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లను అందుబాటులోకి తెస్తామన్నారు.

వైభవంగా చండీ హోమం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులోని వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా అమ్మవార్లకు చండీ హోమం నిర్వహించారు. ఈ హోమంలో గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పురోహితులు హోమాది కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఉగాది ప్రత్యేక కార్యక్రమాలు..

ఆలయ ఈవో పి. లోకేశ్వరి మాట్లాడుతూ బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయంలో పంచాంగ శ్రవణం జరుగుతుందని, భక్తులు హాజరై అమ్మవారిని దర్శించి, ప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

నేడు ఉగాది ప్రతిభా పురస్కారాలు ప్రదానం

కంకిపాడు: మండలంలోని ఉప్పలూరు ఎంపీపీ పాఠశాలలో ఈనెల 22వ తేదీన ఉగాది ప్రతిభా పురస్కారాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు కార్యక్రమ పర్యవేక్షకులు, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పెద్ది అమరలింగేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన వివరాలు తెలుపుతూ గ్రామ పరిధిలోని వివిధ యాజమాన్యాల్లో పదో తరగతి విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు గ్రామ యువజన సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఘనంగా ఉగాది ఉత్సవాలు..

పెనమలూరు: కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కృష్ణా జిల్లా సంస్కార భారతి ఆధ్వర్యంలో మంగళవారం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు భగవద్గీత పఠనం, భరత నాట్యం, లలిత గీతాలు, జానపద నృత్యం, వీణావాదనం, వేణుగానం, కర్ణాటక సంగీతం, జానపద, దేశభక్తి గీతాలు విద్యార్థులు ఆలపించారు. కోలాటం, రంగోళి, చిత్రలేఖనంలో ప్రతిభ చూపారు. ముఖ్య అతిథిగా గ్రామ మాజీ సర్పంచి అన్నే వేణుగోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే ఆర్థిక సాయం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామానికి చెందిన కొణతలపల్లి రమేష్, కొణతలపల్లి నీలిమ కుమారుడు ప్రవీణ్(3) వైద్య ఖర్చుల నిమిత్తం గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ. 50వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మేరకు మంగళవారం నగదును నున్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాధిత కుటుంబానికి స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాటూరి సరళ, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పోలారెడ్డి ప్రసాద్‌రెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దైవ సంకల్పంతోనే..



ఉయ్యూరు: దైవ సంకల్ప బలంతోనే కార్యసిద్ధి లభిస్తుందని సినీ నటుడు సుమన్ అన్నారు. ఉయ్యూరులోని వ్యాపార వేత్త, బీసీ నాయకుడు బొల్లా నాని గోశాలను మంగళవారం కాశీ లోని శైవక్షేత్రం అర్చకులు రామానంద దుబే, శిష్యబృందం సందర్శించింది. ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. లోకకల్యాణార్థం విశేష పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో సినీ నటుడు సుమన్ పాల్గొని పూజలు జరిపించారు. కాశీ శైవక్షేత్రం అర్చకుడు రామానంద దుబే హీరో సుమన్‌కు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. అర్చకులు రామానంద దుబే మాట్లాడుతూ ఉగాది పర్వదినాన ఉదయం శివలింగానికి అభిషేకం, పంచాంగ శ్రవణం ఉంటాయన్నారు. సాయంత్రం సప్తహారతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

'ఆసరా' అర్హుల జాబితా విడుదల

పెనమలూరు: వైఎస్సార్ ఆసరా మూడో దశ రుణమాఫీ జాబితా విడుదల చేశామని గంగూరు సచివాలయ సంక్షేమ అధికారి పి.ప్రేమ్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు సచివాలయంలో వైఎస్సార్ ఆసరా డ్వాక్రా గ్రూపు సభ్యులకు అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గంగూరులో ప్రకటించిన జాబితాలో 947 మందికి రుణ మాఫీకి అర్హులన్నారు. వీరికి రూ. 82,58,643 రుణ మాఫీ నగదు అందనుందన్నారు.